

ద్వీపాన్ని తలపిస్తున్న జలాశయంలోని భూ భాగం

# ప్రకృతి సోయగం.. ప్రగతి లేని పర్యాటకం

- పర్యాటకానికి అనువుగా యోగి వేమన రిజర్వాయర్
- బోటింగ్ ఏర్పాటు చేయాలంటున్న పర్యాటకులు

ముదిగుబ్బ: యోగి వేమన జలాశయం(యోగి వేమన రిజర్వాయర్) అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. చుట్టూ ఎత్తయిన పచ్చని కొండలు, ఆహ్లాదకర వాతావరణం మనసులను పులకింపజేస్తోంది. ఒకవైపు రిజర్వాయర్‌లో జల సవ్వడి, మరోవైపు కాలువలో నీటి గలగలలు, జలాశయంపై భానుడి కిరణాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతం, స్వచ్ఛమైన గాలి, వర్ణనకు అందని అందం, కనువిందు చేసే మరెన్నో సుందర దృశ్యాలు ఇక్కడ కనిపిస్తాయి. ఇన్ని వనరులు వున్నా..పర్యాటకం ప్రగతిలో వెనుకబడి ఉంది. ఎంతో మంది ప్రజా ప్రతినిధులు మారుతున్నా పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించలేదు. దొరిగిల్లు అటవీ ప్రాంతం, జలాశయం వద్ద కొందరు లఘుచిత్రాలను చిత్రీకరించి సోషల్ మీడియాల్లో పెడుతున్నారు.

### ద్వీపంలా జలాశయం

జలాశయం మధ్యలో రెండెకరాల్లో పల్లపు గుట్ట ప్రదేశం ఉండడంతో ద్వీపం లాగా కనిపిస్తోంది. పడవల్లో విహరించేందుకు ఈ ప్రాంతం సముద్రం అనుభూతిని కల్పించేలా ఉండడంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. వేసవిలోనూ నీటి మట్టం తగ్గకుండా 25 అడుగుల మేర నీరు నిల్వ ఉండడంతో నిరంతరం కళకళలాడుతోంది. పర్యాటకులు కుటుంబ సమేతంగా ఇక్కడికి వచ్చి సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో రమణీయ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధిస్తూ సంతోషంగా గడుపుతుంటారు. జలాశయంలో బోటింగ్ పాటు, పార్కు సౌకర్యం, రెస్టారెంట్లు లాంటివి ఏర్పాటు చేసి విహారాన్ని అందుబాటులోకి తెస్తే పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని పర్యాటకులు భావిస్తున్నారు.

### అధ్వానంగా రోడ్డు

పులివెందుల రోడ్డు నుంచి జలాశయం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు నుంచి వెళ్లాలంటే ప్రయాణికులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అడుగడుగునా గుంతలు, రోడ్డు పక్కనే ముళ్ల పొదలు విస్తరించి ఉన్నాయి. రోడ్డును మరమ్మతు చేయడంతో పాటు యోగివేమన జలాశయాన్ని పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



రాళ్లు తేలిన రోడ్డు



యోగివేమన జలాశయ ప్రవేశ ద్వారం

### అన్ని వసతులు ఉన్నా..

జలాశయం నీటి పూర్తి సామర్థ్యం ఒక టీఎంసీ. 70 అడుగుల లోతు, 500 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నీరు ఉంటుంది. 42వ జాతీయ రహదారికి సమీపంలో వుండడంతో ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటక శాఖకు ఆదాయం పెరగడంతో పాటు సందర్శకులు పెరిగే అవకాశం వుంటుంది.

జలాశయం చుట్టూ చెట్లు ఉండడంతో వేసవిలోను నీడను కల్పిస్తాయి. ఈ ప్రాంతంలో శిథిలమైన గదులు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిని మరింత మెరుగు పరిచి అందుబాటులోకి తెస్తే బాగుంటుంది.

### పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



యోగివేమన జలాశయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. తద్వారా ఈ ప్రాంత వాసులు మరింత అభివృద్ధి చెంది అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేసి అందుకు తగిన విధంగా చర్యలు చేపట్టాలి.

– కుళ్లాయప్ప నాయక్, అదవి బ్రాహ్మణపల్లి తండా

### ప్రతిపాదనలు పంపాం

యోగి వేమన జలాశయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇది వరకే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. టూరిజానికి అనువైన వసతులు, నీటి నిల్వలు తదుపరి వాటిని పరిశీలించి అనుమతులు రాగానే పర్యాటకానికి కృషి చేస్తాం.

– కమతం జయకుమార్‌బాబు, జిల్లా పర్యాటక అధికారి

## క్లుప్తంగా

### కారుణ్య నియామకం



నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి అర్బన్: ఇటీవల బత్తలపల్లిలో విధులు నిర్వర్తిస్తూ మరణించిన ఆంజనేయులు కుమారుడిని కారుణ్య నియామకం కింద హోంగార్డుగా ఎస్పీ రత్న నియమించారు. ఈమేరకు ఎస్పీ శనివారం తన చాంబర్‌లోఆంజనేయులు కుమారుడు ప్రసన్న కుమార్‌కు నియామక పత్రం అందజేశారు. హోంగార్డు విధులను నిబద్ధతతో నిర్వహించాలని కుటుంబానికి అండగా ఉండాలని సూచించారు. అన్ని విధాలా మీ కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వళి, ఎస్‌వీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, హోంగార్డ్ ఇంచార్జ్ రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

### ఎస్పీని కలిసిన ప్రొబేషనరీ డీఎస్పీ



ఎస్పీని కలిసిన ప్రొబేషనరీ డీఎస్పీ ఉదయ పావని

పుట్టపర్తి అర్బన్: ధర్మవరం సబ్ డివిజన్ ప్రొబేషనరీ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఉదయ పావని శనివారం ఎస్పీ రత్నను మర్యాద పూర్వకంగా కలిశారు. ధర్మవరం సబ్ డివిజన్‌లో శిక్షణ తీసుకోనున్నట్లు డీఎస్పీ చెప్పారు.

### ప్రతి శనివారం ఫిజియో థెరపీ

కనగానపల్లి: స్థానిక భవిత కేంద్రంలో ప్రతి శనివారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఫిజియోథెరపిస్టు చంద్రకళ తెలిపారు. శనివారం మండల విద్యాధికారిణి కే.టి. శ్రీదేవి పర్యవేక్షణలో దివ్యాంగులకు ఫిజియోథెపీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని మండలంలోని దివ్యాంగులందరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ జగదీశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.

### అలసంద పంట దగ్ధం



కాలిపోయిన అలసంద పంట

తనకల్లు: ఎర్రబెల్లిలో అలసంద పంట శనివారం అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివన్న మూడు ఎకరాల్లో అలసంద పంట సాగు చేశాడు. అయితే కొందరు ఆకతాయిలు పొలానికి సమీపంలో ఉన్న గుట్టకు నిప్పు పెట్టారు. గాలికి మంటలు పొలానికి వ్యాపించడంతో సాగులో ఉన్న అలసంద పంట దగ్ధమైంది. దీంతో పాటు 250 మీటర్ల విద్యుత్ సర్వీసు వైరు కాలిపోయింది. ఇంకో పది, పదిహేను రోజుల్లో పంట చేతికొచ్చేదని, ఈ ఘటనతో రూ.1.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

### సజావుగా పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: మండలంలో శనివారం సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. మొత్తం 6,240 మందికిగాను 5,969 మందికి పింఛన్ సొమ్ము అందించనట్లు ఎంపీడీఓ నరసింహ నాయుడు తెలిపారు.

కదిరి అర్బన్: ముత్యాలచెరువు గ్రామంలో శనివారం ఎంపీడీఓ పోలప్ప ఆధ్వర్యంలో సామాజిక భద్రతా పెన్షన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

ధర్మవరం రూరల్: పట్టణంలో పింఛన్ల పంపిణీ శనివారం సజావుగా జరిగిందని మున్సిపల్ కమీషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. 18,112 మందికి రూ.7. 87 కోట్లు పంపిణీ చేశామన్నారు.

### రోడ్డు నిబంధనలతో ప్రమాదాల నివారణ



రోడ్డు భద్రతపై ప్రమాణం చేస్తున్న దృశ్యం

ఓడీచెరువు: రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని కదిరి ఆర్టీఓ శ్రీనివాసులు, ఎంవీఐ వరప్రసాద్, ఏఎంవీఐ రాజేష్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. రహదారి భద్రతపై విద్యార్థులతో ప్రమాణం చేయించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ మారగానికుంట్ల ఫక్రుద్దీన్ పాల్గొన్నారు

## జల చౌర్యం చేస్తే క్రిమినల్ కేసులు



అనంతసాగరం వద్ద కాలువను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

బత్తలపల్లి: జల చౌర్యం జరగకుండా ధర్మవరం కుడికాలువపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులను పెట్టాలని ఆర్డీఓ మహేష్ సిబ్బందికి సూచించారు. శనివారం అనంతసాగరం గ్రామం వద్ద ధర్మవరం కుడి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడి కాలువ ద్వారా బత్తలపల్లి, తాడిమర్రి మండలం నార్శింపల్లి చెరువులకు విడుదలయ్యే నీటిని కొందరు వ్యక్తులు సొంత అవసరాలకు మళ్లించుకున్న విషయంపై క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. జల చౌర్యం చేస్తున్న వ్యక్తులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగించాలని ఆదేశించామన్నారు. కాలువపై పహారా కోసం సిబ్బందిని నియమించాలని తహసీల్దార్, ఎస్ఐ ఆదేశించినట్లు తెలిపారు. తహసీల్దార్ స్వర్ణలత, మైనర్ ఇరిగేషన్ డీఈఈ మహేశ్వర్‌రెడ్డి, పీఏబీఆర్ ఏఈ, మాల్యవంతం వీఆర్‌ఓ మణికుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బీమా రంగంలో ఎఫ్‌డీఐలు నష్టదాయకం



ఎల్ఐసీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కదిరి టౌన్: బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలకు అనుమతించడం ప్రజలకు నష్టదాయకమని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం నేతలు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)కు అనుమతించడంపై స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74 నుంచి 100 శాతానికి పెంచడం బీమారంగంతో పాటు పాలసీదారులకు ఏమాత్రం క్షేమకరం కాదన్నారు. నేరుగా విదేశీ కంపెనీలు బీమా రంగంలో అడుగుపెడితే దేశంలో 1956కు ముందు పరిస్థితులు ఉత్పన్నమవుతాయన్నారు. ఈ నిర్ణయం మరోవైపు దేశ ప్రజలకు నమ్మకమైన సేవలందిస్తున్న ఎల్ఐసీని పరోక్షంగా దెబ్బతీస్తుందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే సమ్మెకు వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ‘ఫీజు పోరు’ను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త మక్బూల్, నాయకులు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల5న తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు.శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పుల రూపంలో దాదాపు రూ.3900 కోట్ల బకాయి పెట్టిందన్నారు. వీటిని వెంటనే చెల్లించాలని కోరుతూ ఈనెల 5న పుట్టపర్తిలోని కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పూలశ్రీనివాసరెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇంచార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

తాడిమర్రి: అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి ముసుగు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో కలసి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారన్నారు. రేషన్‌కార్డులు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కుళ్లాయప్ప, మండల అధ్యక్షులు, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, దాసు, సన్న పెద్దన్న, చౌడప్ప, రాముడు, ఓసూరప్ప తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేయండి

తాడిమర్రి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తాడిమర్రి మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులుకు సూచించారు. మండల కన్వీనర్‌గా రెండోసారి నియమితులైన సందర్భంగా రామాంజనేయులు శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యేను ధర్మవరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. రామాపురం సర్పంచ్ కుంటాల పుల్లయ్య, తలారి ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.



కేతిరెడ్డిని సన్మానిస్తున్న ఆర్వేటి రామాంజనేయులు

## జాతీయ సమైక్యత శిబిరానికి ధర్మవరం విద్యార్థి



హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

ధర్మవరం రూరల్: పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ విద్యార్థి హర్షవర్ధన్ జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హర్షవర్ధన్ పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని శ్రీవైఎన్ కాలేజ్‌లో ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు జరిగే శిబిరంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.గోపాల్ నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోరంట్ల వద్ద లిక్కర్ గోదాము ఏర్పాటు చేయాలి

పుట్టపర్తి అర్బన్: గోరంట్ల మండలంలో ప్రభుత్వ లిక్కర్ గోదాము ఏర్పాటు చేయాలని గోరంట్ల వాసులు కోరారు. ఈమేరకు శనివారం వారు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి గోవిందనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో కరువు అధికంగా ఉందని, గోరంట్ల సమీపంలోని హైవే సమీపంలో లిక్కర్ గోదాము ఏర్పాటు చేయడం ద్వారా కొంత మందికి ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. ఇందుకు అనుకూలమైన భూమి సైతం ఉందన్నారు. స్పందించిన గోవిందనాయక్ తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### చలో విజయవాడకు తరలిరండి

పుట్టపర్తి అర్బన్: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈనెల 5న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు కోరారు. శనివారం స్థానిక సాయి ఆరామంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనప్పతో కలిసి చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆసాది గంగిశెట్టి, నాయకులు గోవిందప్ప, నరసింహులు, ఆదిశేషు, ఈశ్వర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ముస్లిం ఐక్యవేదిక గౌరవ సలహాదారుగా గౌస్ లాజమ్



ఓడీచెరువు: ముస్లిం ఐక్యవేదిక (ఎంఐవీ) శ్రీ సత్యసాయి జిల్లా గౌరవ సలహాదారుగా కట్టుబడి గౌస్ లాజమ్‌ను నియమితులయ్యారు. శనివారం తిరుపతిలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఖలీల్ సయ్యద్ గౌస్ లాజమ్ నియామకాన్ని ప్రకటించారు. ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈసందర్భంగా గౌస్ లాజమ్ పేర్కొన్నారు.

### ఖాద్రీ ఆలయంలో భక్తుల సందడి



ఆలయ ప్రాంగణంలో దీపాలు పెడుతున్న మహిళలు

కదిరి టౌన్: ఖాద్రీ ఆలయంలో శనివారం భక్తుల సందడి కనిపించింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, కడప, చిత్తూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా నరసింహ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మహిళలు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ట



పూజలందుకున్న ఆంజనేయస్వామి

ముదిగుబ్బ: దామానుపల్లి సమీపంలోని మునేశ్వరుడి గుట్టపై ఆంజనేయస్వామి ఆలయ పునరుద్ధరణ పూర్తయిన సందర్భంగా స్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు శనివారం ముగిసాయి. ఈసందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులివెందుల మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం గుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

### శివపార్వతుల కల్యాణం

బత్తలపల్లి: స్థానిక లలితా త్రిపుర సుందరి సమేత ఓంకారేశ్వరుని స్వామి ఆలయంలో శనివారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. శివుడి తరపున ఆలయ ధర్మకర్త సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సుధ దంపతులు, పార్వతి తరపున కమతం లక్ష్మీనారాయణ, అంజనమ్మ దంపతులు నిలుచుకొని ఎదురుకోళ్లోత్సవం నిర్వహించారు. అనంతరం వేదపండితులు బాలాజీ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఉత్సవమూర్తులకు వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం చేపట్టారు.

### మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

నల్లమాడ: పెమనకుంటపల్లి తండాలో నూతనంగా నిర్మించిన మారెమ్మ ఆలయంలో మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 4 గంటల నుంచి వేద పండితులు గణపతి పూజ, గంగపూజ, స్వస్తివాచన, దేవతా నాంది పంచగవ్యం, కలశ స్థాపన, దీక్షా హోమం తదితర పూజలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున మారెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### మార్కండేయ జయంతి



జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: ధర్మవరం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం గొట్లూరు అనాథాశ్రమంలో మార్కండేయ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు వృద్ధులకు అన్నదానంతోపాటు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు పుత్తా రుద్రయ్య, నాయకులు జింకా నాగభూషణం, మెటికల బాల కుళ్లాయప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న శివశంకర్

కదిరి అర్బన్: బ్లూమూన్ ఇంటర్‌నేషనల్ స్కూల్ 15వ వార్షికోత్సవాన్ని శనివారం బ్లూమూన్ విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, కార్యదర్శి శ్రీదేవి ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ, ఆర్టీఓ శ్రీనివాసులు, రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డా. మదన్‌కుమార్, అధ్యాపకులు సుందర్‌మోహనరెడ్డి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
8008554500, 9912220726
9010593486, 9912220717